క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో షిర్డీ సాయిబాబా దేవాలయం 17వ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సుప్రభాత సేవ, కాగడ హారతి, విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, మండపారాధన, సాయి వ్రతాలు, సాయంత్రం సంధ్యాహారతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ దర్మకర్త జి.పద్మజ గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

వీధి కుక్కల తరలింపు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని 12వ వార్డులో మంగళవారం డాగ్ క్యాచర్స్ 30 వీధి కుక్కలను పట్టుకుని జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించారు. కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కుక్కల పట్టివేతకు చర్యలు తీసుకున్నట్లు వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ తెలిపారు. పట్టుకున్న కుక్కలకు ఏబీసీ సెంటర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల అనంతరం ఇక్కడికి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



జడ్చర్ల టౌన్: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పన అన్నారు. మంగళవారం మండలంలోని మొరంబాయితండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు మేఘమాల, కృష్ణమ్మ, సరస్వతి, జయమ్మ, సునీత, భాగ్యమ్మ, నాగమణి, ఆశావర్కర్ మస్రు తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో చెక్కు అందుకున్న ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు



దేవరకద్ర: మండలంలోని మీనుగోనిపల్లికి చెందిన తెలుగు విజయ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టింది. ఆమెకు మొదటి విడతగా రూ. లక్ష చెక్కును మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన కల్పించండి



నవాబుపేట: ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన భూ భారతి పోర్టల్‌పై రైతులకు అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం నవాబుపేట తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్త రేషన్‌కార్డుల జారీ తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి పోర్టల్‌పై రెవెన్యూ సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త పోర్టల్‌లో వచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి.. ఎప్పటికప్పుడు జిల్లాస్థాయి అధికారులకు పంపించాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సువర్ణ ఉన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం..

రాజాపూర్: భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. అందులో భాగంగా భూ భారతి పోర్టల్ అందుబాటులోకి తీసుకువచ్చిందని మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జడ్చర్ల, దేవరకద్ర ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిలను కలిసి భూ భారతి అమలుపై హర్షం వ్యక్తంచేశారు. వారి వెంట రాములుగౌడ్, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

గాలివాన బీభత్సం



మూసాపేట మండలం జానంపేటలో వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం

- విరిగిన విద్యుత్ స్తంభాలు.. నేలకూలిన చెట్లు
- వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం
- నవాబుపేటలో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న వరిపైరు



హన్వాడ మండలం టంకరలో నేలకూలిన చెట్లు

నవాబుపేట/హన్వాడ/అడ్డాకుల: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోగా.. చెట్లు నేలకూలాయి. అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ పొలాలు, రోడ్లపై ఆరబోసిన వరిధాన్యం తడిసి ముద్దయ్యింది. నవాబుపేట మండలంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చింది. వడగండ్ల ధాటికి వరిపైరు నేలకొరిగింది. గింజలన్నీ నేలరాలడంతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని బంగ్రంపల్లిలో దాదాపు 69 ఎకరాలు, రుద్రారంలో 170 ఎకరాలు, మరికల్, హాజిలాపూర్, కొండాపూర్ గ్రామాల్లో 76 ఎకరాల్లో వరిపంట దెబ్బతిందని మండల వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

■ హన్వాడ మండలంలోని టంకర, గుడిమల్కాపూర్, హన్వాడ, పెద్దదర్పల్లి, కొత్తపేట తదితర గ్రామాల్లో ఈదురుగాలుల ధాటికి చెట్లు నేలకూలాయి. పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోయాయి. వరి పొలాల్లోకి ముళ్లకంపలు కొట్టుకువచ్చి పడ్డాయి. మండలంలోని అటవీ ప్రాంతంలో వడగండ్ల వర్షం కురిసింది.

■ అడ్డాకుల, మూసాపేట మండలాల్లో గాలివాన దుమారంతో రైతులకు అపారనష్టం వాటిల్లింది. అడ్డాకుల, శాఖాపూర్, పొన్నకల్, రాచాల, కందూర్, మూసాపేట, జానంపేట, చక్రాపూర్, వేముల, దాసర్‌పల్లి గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యం ఆరబోసుకోగా.. అకాల వర్షానికి తడిసిపోయింది. జానంపేటలో సర్వీస్ రోడ్డుపై ధాన్యం కొట్టుకుపోయింది. అడ్డాకులలో సర్వీస్ రోడ్డుపై చెట్టు కూలిపడటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.



బంగ్రంపల్లిలో నేలరాలిన గింజలు

ప్రభుత్వం ఆదుకోవాలి..

నాకు ఉన్న నాలుగెకరాల పొలంతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశా. ఇప్పటి వరకు రూ. 4లక్షల పెట్టుబడి అయ్యింది. రెండు రోజుల్లో పంట ఇంటికి వచ్చేది. వరికోత మిషన్ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో వడగండ్ల వర్షం కురవడంతో పంట మొత్తం దెబ్బతింది. ప్రభుత్వం ఆదుకోవాలి. – చిన్నయ్య, రైతు, బంగ్రంపల్లి, నవాబుపేట మండలం

'స్లాట్ బుకింగ్'పై ప్రజాభిప్రాయ సేకరణ

- నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్



పోస్టుకార్డు అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్ మొహమ్మద్ హమీద్

మెట్టుగడ్డ: రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10న స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అందులో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో ప్రారంభమైన స్లాట్ బుకింగ్ సేవలు, కార్యాలయ సిబ్బంది పనితీరుపై ప్రజాస్పందన తెలుసుకోవాలని భావించిన సబ్ రిజిస్ట్రార్.. వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు. కార్యాలయానికి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చే అమ్మకపు, కొనుగోలు దారుల అభిప్రాయం తెలుసుకునేందుకు గాను పోస్టుకార్డులు పంపిణీ చేస్తున్నారు. పోస్టుకార్డులో ప్రజలు స్లాట్ బుకింగ్ సేవలపై తమ అభిప్రాయాన్ని రాసి రాష్ట్ర కమిషనర్, రిజిస్ట్రేషన్ ఐజీ, రిజిస్ట్రేషన్ భవన్, హైదరాబాద్ అడ్రస్‌కు పంపేలా కార్డు రూపొందించారు.

'ఫోరం' సేవలు ఆదర్శనీయం: డీఎస్పీ



ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ అందజేస్తున్న ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు అందిస్తున్న సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ కూడళ్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు 'ఫోరం' ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా మంగళవారం ఈ కార్యక్రమాన్ని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులోనూ అవిశ్రాంతంగా సమాజానికి సేవలందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ.. నడిరోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు అహర్నిశలు కృషి చేస్తున్న పోలీసులకు వేసవి కాలం ముగిసే వరకు మజ్జిగ పంపిణీ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, సభ్యులు బాలయ్య, లక్ష్మణ్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, మనోహర్‌రావు, సుభాష్ ఆర్య, అహమ్మద్, ఎ.రాజసింహుడు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణం చేసే క్రమంలో సంభవించే అగ్నిప్రమాదాల నుంచి ఎలా రక్షించుకోవాలనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మహబూబ్‌నగర్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ మల్లికార్జున్ అన్నారు. జిల్లా అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా బయటపడాలనే అంశంపై మాక్‌డ్రిల్ చేసి చూపారు. అదే విధంగా పలు రకాల ఫైర్ కంట్రోల్ ప్రక్రియను ప్రదర్శించారు. అనంతరం ఫైర్ సేఫ్టీ కరపత్రాలను పంపిణీ చేశారు.

కనులపండువగా ఆది దంపతుల కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్ ఊకచెట్టు వాగు సమీపంలో వెలసిన స్వయంభూ శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు ఆది దంపతులను పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించి.. కల్యాణం జరిపించారు. కల్యాణ వేడుకలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని శాలువాలతో సత్కరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీ

అడ్డాకుల: దేశంలో రాజ్యాంగ హక్కులను బీజేపీ కాలరాస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల ఆరోపించారు. రాచాలలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రజలందరి హక్కులను కాపాడే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తుందన్నారు. పల్లెల్లో ప్రతి ఇంటికి రాజ్యాంగ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించి రాజ్యాంగ హక్కులను కాపాడేందుకే ప్రజలను చైతన్యం చేయడానికే పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో గౌరి సతీష్, జహీర్ అక్తర్, నాగిరెడ్డి, జగదీశ్వర్, శెట్టి శేఖర్, నాగార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని 11 కేవీ జిల్లా పరిషత్ ఫీడర్, 11 కేవీ పట్టణ-1 ఫీడర్ల పరిధిలో చెట్ల కొట్టివేత కారణంగా బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏఈ ఆదిత్య, టౌన్- 3 ఏఈ అరుణ్ నాయక్ మంగళవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. దీంతో కొత్త బస్టాండ్, తెలంగాణ చౌరస్తా, తెలంగాణ కాలనీ, కోర్టు పరిసర ప్రాంతాలు, టీచర్స్ కాలనీ, శంకర్‌లింగం ఆస్పత్రి, నలందా ఆటోస్టాండ్, షాషాబ్ గుట్టు, బీకే రెడ్డి కాలనీ, ఎంపీ సుబ్బారెడ్డి స్కూల్, ఫరూఖ్ మసీద్, దోనల్ల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

రూరల్ మండలం ఏర్పాటు చేయాలి

జడ్చర్ల టౌన్: జడ్చర్ల రెవెన్యూ డివిజన్‌తో పాటు రూరల్ మండలం ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజన్ సాధన సమితి కోఆర్డినేటర్లు రమేశ్ నాయక్, కృష్ణయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్పీస్ భవనం వద్ద సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, నవాబుపేటలో కొల్లూరు మండలం ఏర్పాటుచేసే విషయంలో స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని స్వాగతించారు. అయితే రెవెన్యూ డివిజన్ త్వరగా ఏర్పాటయ్యేలా చూడాలని కోరారు. అదే విధంగా జడ్చర్ల మండలం 45 గ్రామపంచాయతీలతో ఉందని.. ఎక్వాయపల్లి, చిన్న ఆదిరాల గ్రామాలు మండల కేంద్రానికి 23 కి.మీ. దూరంలో ఉన్నాయన్నారు. ఈ కారణంగా రూరల్ మండలం ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. రూరల్ మండలం సాధన కోసం తాము ముందుండి పోరాడుతామని స్పష్టం చేశారు. వీటితో పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవశ్యకత ఉందని, రూరల్ పోలీస్‌స్టేషన్‌కు భవనం నిర్మించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భీంరాజ్, రంగయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో కూలి రేట్లు పెంచొద్దు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యం సంచులు ఖాళీ చేయడం, నింపడం వంటి పనులకు కూలి రేట్లు పెంచవద్దని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం మార్కెట్ కార్యదర్శి నవీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో బస్తా తూకం 30 కిలోలకు తగ్గించారని.. అలా కాకుండా 50 కిలోలకు మార్చాలన్నారు. ఒక బస్తా ధాన్యం ఖాళీ చేసేందుకు రూ. 3 పైగా వసూలు చేస్తున్నారని తెలిపారు. క్వింటాల్ ధాన్యం విక్రయించడానికి వచ్చే రైతుకు కమీషన్, హమాలీల కూలి కలిపి మొత్తం రూ.45 వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. అదే 50 కిలోల బస్తా అయితే రైతులకు కొంత మేలు కలుగుతుందన్నారు. మార్కెట్‌లో ఇష్టారాజ్యంగా రేట్లు పెంచడం ఏమాత్రం సరికాదన్నారు. తమ విన్నపాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి సైతం పంపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, నాయకులు బుక్క నవీన్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ముందు వరుసలో నిలపాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ పథకాల అమలుతో పాటు మహిళా శక్తి, బ్యాంక్ లింకేజీ, ఉపాధి హామీ కార్యక్రమాల్లో జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో నిలపాలని కలెక్టర్ విజయేందిర సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల గ్రూపులలో ఇంకా చేరని మహిళలు ఉంటే సభ్యులుగా చేర్పించాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫాం కుట్టు పనులు, సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు, మినీ గోదాం, పెట్రోల్ బంక్‌లు, బస్సులు నిర్వహణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు చురుగ్గా పని చేసేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కింద గరిష్ట వేతన రేటు రూ.307కు పెంచినందున జాబ్‌కార్డు కూలీలు గరిష్ట వేతనం పొందేలా కొలతలు వేసి పనులు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తుల గడువు ముగిసినందున ఆన్‌లైన్‌లో వచ్చిన వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ వారీగా, సబ్సిడీ యూనిట్ వారీగా విభజించాలని, ఈ ప్రక్రియ ఈ నెల 20లోగా పూర్తి చేయాలన్నారు. మండల, జిల్లా కమిటీ పరిశీలన అనంతరం జూన్ 2న ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో మంజూరు చేయనున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్దేశిత సమయం లోగా పూర్తి చేయాలని అన్నారు. ఏప్రిల్ 17 లోగా సంబంధిత శాసనసభ్యులను సంప్రదించి మండల, గ్రామాల వారీగా టార్గెట్ నిబంధనలు అనుసరించి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇందిరా, డీఆర్‌డీఓ నరసింహులు, అదనపు డీఆర్‌డీఓ బోజప్ప, డీపీఓ పార్థసారథి ఉన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక సాధికారత



సర్టిఫికెట్లు అందిస్తున్న చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల టౌన్: స్వయం ఉపాధి మార్గాలతో ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. పట్టణంలోని ఉమెన్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సు పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్ లాంటి వాటిలో ఆయా సంస్థలు ఇస్తున్న కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 20 మంది బ్యూటీషియన్ శిక్షణను పూర్తిచేసుకున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్ల పంపిణీలో సొసైటీ నిర్వాహకురాలు బాలమణి, శిక్షకురాలు వినీత, కౌన్సిలర్ సతీశ్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పరిశీలన

మున్సిపాలిటీలోని సిగ్నల్‌గడ్డపై రోడ్డు విస్తరణ పనుల కారణంగా ధ్వంసమైన మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పరిశీలించారు. పైప్‌లైన్ ధ్వంసం కావడంతో 3, 4, 14, 15, 16, 20 వార్డులకు రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

స్వార్థ రాజకీయాలకు బలికావొద్దు



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్వార్థ రాజకీయాలకు ముదిరాజ్‌లు బలికావొద్దని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన ముదిరాజ్ మహాసభ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టబద్ధంగా రిజిస్టర్ అయిన సంఘాలకే అధికార పార్టీ నేతలు, ప్రభుత్వ అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కొందరు స్వార్థపరులు, అవకాశవాదులు తమ పబ్బం గడుపుకోవడానికి ముదిరాజ్ కులాన్ని రాజకీయ అవసరాలకు వాడుకోవాలని చూస్తున్నారని.. అలాంటి వారిపై ముదిరాజ్ కులస్తులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. శ్రీనివాస కాలనీలోని ముదిరాజ్ మహాసభ భవనంపై కొందరు తప్పుడు కథనాలు ప్రచారం చేయడం తగదన్నారు. ముదిరాజ్‌లను తప్పుదోవ పట్టించాలని చూస్తే సహించమన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెట్టుకాడి ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా రాములు, రవి, బాలసాయన్న, శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారులుగా లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా రాకమయ్య, బుచ్చన్న, నరేందర్, రాములు, కృష్ణయ్య, శ్రీహరి, నాగరాజు, పట్టణ అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులుగా మోహన్, యూత్ అధ్యక్షుడిగా గంగాధర్, నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా బార్ భరత్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, చంద్రుడు, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షుడిగా రాములు, హన్వాడ కన్వీనర్‌గా రాజు, 21వ వార్డు అధ్యక్షుడిగా చాణిక్య ఎన్నికైనట్లు తెలిపారు.

ఆయిల్‌పాం రైతులకు రాయితీ పెంచాలి



ఆయిల్‌పాం తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రాజాపూర్: దేశవ్యాప్తంగా నూనె గింజలు, ఆయిల్‌పాం తోటలను పర్యవేక్షించడంలో డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కీలకపాత్ర పోషిస్తుందని డీఓడీ పొన్నుస్వామి, రాష్ట్ర ఉద్యానశాఖ అడిషనల్ డైరెక్టర్ సరోజినిదేవి, కొండా లక్ష్మణ్ బాపూజీ యూనివర్సిటీ ఉద్యాన శాస్త్రవేత్త విజయకృష్ణ అన్నారు. బాలానగర్, రాజాపూర్ మండలాల్లో రైతులు సాగుచేసిన ఆయిల్‌పాం తోటలను మంగళవారం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆయిల్‌పాం రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఎకరాకు రూ. 4,200 రాయితీ ఇస్తోందని.. ఇది కూలీల ఖర్చులకే సరిపోవడం లేదని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎకరాకు రూ. 8వేల నుంచి రూ. 10వేల వరకు రాయితీ ఇవ్వాలని కోరారు. అదే విధంగా డ్రిప్ పరికరాలను రెండింతలు ఇవ్వడంతో అధిక దిగుబడి సాధించేందుకు వీలుంటుందని అధికారులకు వివరించారు. జిల్లాలో 4,500 ఎకరాలకు ఆయిల్‌పాం తోటలను విస్తరించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్ తెలిపారు. అధికారుల వెంట హార్టికల్చర్ ఏఓ మహేందర్, రైతులు మురళీధర్‌రెడ్డి, ఆదిరమణారెడ్డి, శ్రీశైలం ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటాం



దేవరకద్రలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: అకాల వర్షంతో తడిసిన ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లిస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర మార్కెట్ యార్డు, నాగారం పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అకాల వర్షంతో ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. తడిసిన ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని.. చివరి గింజ వరకు మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే 40 కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. దేవరకద్ర, నాగారం కొనుగోలు కేంద్రాల్లో గత వానాకాలం సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు రూ. 5కోట్ల వరకు బోనస్ చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కతలప్ప, వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సీఈఓ కిషోర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కోన రాజశేఖర్, ఆదిహన్మంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, బాలస్వామి, ఫారూఖ్, రాంపాండు, నర్సింహారెడ్డి, జవహర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

■ మండలంలోని డోకూర్, గోపన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిషన్‌రావు, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 2,912 దరఖాస్తులు

నవాబుపేట: మండలంలో రాజీవ్ యువవికాసం పథకానికి 2,912 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ జయరాం నాయక్ తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 1,702, ఎస్సీ కార్పొరేషన్‌కు 596, ఎస్టీ కార్పొరేషన్‌కు 465, మైనార్టీ కార్పొరేషన్‌కు 12 దరకాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.